"ఎందుకవూ...ఎళ్ళొచ్చాయి. తెల్లారేసరికి కాఫీ చెయ్యాలని తెలీదూ!"

అప్పుడే నిద్రలేస్తున్న రజని ఇంత ప్రొద్దుటే ఈయన ఎవరినబ్బా ఇంతలా కేక లేస్తున్నది అనుకుంటూ వంట గదిలోకి వచ్చి అక్కడి దృశ్యం చూసి నిర్విణ్ణురాలై నిల్చున్నది.

ఎంతో సౌమ్యుడిగా కనిపించే తన భర్త అత్తగారి మీద రంకె లేస్తున్నాడు. ఆవిడ కళ్ళ నీరు ఒప్పుకుంటోంది. చూస్తూ ఊరుకోలేక పోయింది రజని కొత్త కోడలైనా. "అదేమిటండీ, అలా అత్తగార్ని..." ఆమె నోట్లో మాటలు ఉండగానే- "నువ్వు ముందిక్కడ్నుంచి వెళ్ళు" అని కసురుకున్నాడు రాజశేఖరం.

రజని ఆ క్రిందటి రోజే కాపురానికి వచ్చింది. భర్త దగ్గర ఆమె కింకా చనువు ఏర్పడలేదు. అతనికి ఎదురు చెప్పలేక ఆ గది లోంచి వచ్చేసింది.

రాజశేఖరం స్నానానికి వెళ్ళాక రజని వంట గదిలోకి దారి తీసింది. అత్తగారు కళ్ళొత్తుకుంటోంది. కడుపు చించుకు పుట్టిన కొడుకు అలా ప్రవర్తించడం ఏ తల్లికైనా బాధాకరమే మరి. ఆమెను అలా చూడగానే రజని మనసు చివుక్కుమంది.

"బాధపడకండత్తయ్యా! ఏమిటో వారి స్వభావం!" అత్తగార్ని ఓదారుస్తూ బాధగా అంది.

"అంతా నా ప్రారబ్ధం, తల్లీ! నువ్వు వెళ్ళిపో. అబ్బాయి వచ్చాడంటే..."

ఆవిడ మాటలు పూర్తి కాకుండానే ప్రళయ కాల రుద్రుడిలా రానే వచ్చాడు రాజశేఖరం."ఏం మునలమ్మా... చాడీలు చెప్తున్నావా! ఛీ నిన్ను పోషించడం కంటే వీధి కుక్కను మేపడం నయం. అది విశ్వాసమైనా చూపిస్తుంది." అరిచాడు తల్లిని కొట్టవస్తూ.

"ఛ. -అవేం మాటలండీ!" గొంతు పెగల్చుకుంటూ అంది రజని భయపడుతూనే.

"నీకు తెలీదులే. నువ్వు ముందు గదిలోకి నడువ్." కటువుగా ఉన్న అతని స్వరానికి హడలిపోతూ గదిలోకి వచ్చేసింది రజని.

వెనుకనే రాజశేఖరం వచ్చాడు. అతను ఆఫీసుకు వెళ్ళడానికి తయారవు తున్నాడు.

రజని ఆ గది లోంచి బయటకు వెళ్ళబోయింది.

"ఎక్కడకు?" అడిగాడతను.

"వంటింట్లో పాపం అత్తయ్య ఒక్కరే ఉన్నారు. కాస్త సహాయం చేద్దామని..." బెదురుతూ అంది రజని.

"అక్కర్లేదు. పందిలా మేస్తుంది. ఆ కాస్త పని చేయలేని సుకుమారేం కాదులే మీ అత్తగారు." కోపం, హేళన మేళవించి అన్నాడతను.

రజని మనసు కష్టపడింది. అత్తగారి మీద భర్తకు ఎందుకంత కోపమో ఆమెకు అంతు బట్టడం లేదు. ఏ కొడుకూ తల్లిని ఇంతగా ద్వేషించడు. తన భర్త హృదయం ఇంతగా బండబారటానికి ఏదో కారణం ఉండే ఉంటుంది. ఏమిటది? ఆలోచనలో పడింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు. వెళ్ళొస్తా తలుపేసుకో!" రాజశేఖరం వెళ్ళిపోయాడు.

రజని ఆలోచిస్తూనే ఉంది. అత్తగారి విషయంలో భర్త ప్రవర్తనకు కారణాలు ఊహిస్తోంది. అత్తగారి నడిగితే- "అంతా నా ప్రారబ్ధం, తల్లీ" అంటుందే గాని ఏమీ చెప్పదు.

రోజులు గడిచిపోతున్నాయి. రజని కాపురానికి వచ్చి మూడు నెలలు దాటిపోతోంది. తల్లి విషయంలో రాజశేఖరంలో ఎట్లాంటి మార్పు లేదు. భర్త దగ్గర ఎంత చనువేర్పడినా, ఈ విషయంలో అతను రజనికి అర్థం కాని వాడిగానే మిగిలిపోయడు. ఆ విషయంలో తప్ప మిగిలిన అన్ని విషయలలో అతను మచ్చ లేనివాడు. తల్లి విషయంలో కొడుకుగా అతని ప్రవర్తనను రజని సహించలేకపోతోంది. ఆ వృద్ధురాలు తన వారంటూ ఉండి కూడా చిత్రహింస అనుభవించడం వల్ల రజనికి మనశ్శాంతి కరువై పోతోంది. ఒక రోజు తెగించి భర్తతో ఆ విషయం కదిపింది.

కాపురానికి వచ్చిన దగ్గర్నుంచీ రజని ఆలోచనలన్నీ గమనిస్తూనే ఉన్నాడు రాజశేఖరం. ఆమె ఎప్పుడో ఆ విషయం అడుగుతుందని కూడా అతను ఊహించాడు. తన ప్రవర్తనకు కారణం ఏదో నాడు ఆమెకు చెప్పవలసి వస్తుందని అతను అనుకుంటూనే ఉన్నాడు. అది తన బాధ్యత కూడా! అసలు తనే ఏదోనాడు తన ఈ ప్రవర్తనను కారణాలు వివరించి హృదయవేదన తగ్గించుకుందామని అనుకుంటూనే ఉన్నాడు. ఈలోగా రజనే తెగించి అడిగేసింది.

"నేనూ ఓ కొడుకునే, రజనీ! నాకూ తల్లి మీద ప్రేమ ఉంటుంది. తల్లి ప్రేమలో మునిగి తేలాలనే నాకూ ఉంటుంది. ఆమె పట్ల అలా ప్రవర్తిస్తున్నందుకు నేనూ బాధ పడుతుంటాను. అయితే, ఆమె ముఖం చూడగానే ప్రేమ పటాపంచలైపోతుంది. ఆమె ముఖంలో నాకు అమ్మ కనబడదు. పిశాచంలా కనబడుతుంది ఆమె ముఖం.

అందరికీ అమ్మంటే ఒక దేవత. నాకు మాత్రం ఓ రాక్షసి. ఓ గయ్యాళి. ఆవిడ నోటికి భయపడి నాన్న కుక్కిన పేనులా ఉండేవారు. దానితో ఈమె ఆగడాలకు హద్దులు లేకుండా పోయాయి. మా నాయనమ్మ ఒక దేవత. నన్నెంతో ప్రేమగా చూసేది. నేనంటే తహతహ లాడిపోయేది. అది మీ అత్తకు గిట్టేది కాదు. ఆ వృద్ధాప్యంలో నాయనమ్మ చేత ఇంటి పనే కాకుండా పశువుల పని, పొలం పని చేయించేది. ఈమెకు ఏ కోశానా దయాదాక్షిణ్యాలుండేవి కావు. రోగం వచ్చినా, రొష్టు వచ్చినా ఇంటి చాకిలీ సమస్తం నాయనమ్మ చెయ్యాల్సిందే. ఎంత చేసినా ఆమెకు మెప్పు లభించేది కాదు. పైగా తిట్లూ, పాట్లూ. నాయనమ్మకూ మా నాన్న తప్ప ఇతర సంతానం లేదు. ఇంకెక్కడికి వెళ్తుందావిడ.

నాయనమ్మ అంటే నాకు ప్రాణం. నాయనమ్మ దగ్గరకు వెళ్తే చాలు... ఈవిడ నన్ను చావబాదేది. నన్ను అడ్డం పెట్టుకొని నాయనమ్మను అడ్డమైన తిట్లూ తిట్టేది. ఇంతలో నాన్నగారు చనిపోయారు. అప్పటికే మీ అత్త చెలరేగి పోయింది. ఇక నామ మాత్రంగా ఉన్న ఆ కాస్త అడ్డూ తీరిపోవడంతో ఇంకా మితిమీరి పోయింది. చెట్టంత కొడుకు మరణంతో క్రుంగిపోయింది నాయనమ్మ. దానికి తోడు కోడలి చిత్రహింసలు! బ్రతికి ఉండగానే నరకం చూసిందా మహాతల్లి.

గోరుచుట్టు మీద రోకటి పోటులా నాయనమ్మకు పక్షవాతం వచ్చింది. నౌకరుతో నాయనమ్మను పశువుల కొట్టంలో పెట్టించిందీవిడ. అప్పుడే ఊహ తెలుస్తోంది నాకు. నేను సహించలేక ఎదురు తిరిగాను. నా ఎదురుగా తన ఆటలు సాగవనుకుందేమో... చదువు వంకన నన్ను హైదరాబాదు పంపించేసింది.

ఆరోజు.......

ఆ రోజు నేను జీవితంలో మరిచిపోలేని రోజు. అప్పుడు నేను డిగ్రీ చదువుతున్నాను. కాలేజీకి వెళ్తుండగా మా ఊరి మనిషి కనబడి పలకరించాడు- "ఏం, బాబూ. మీ నాయనమ్మ చనిపోయినా



# రేపటి అత్తగారు

కట్నేని వెంకట కృష్ణారావు



మన ఊరువచ్చావు కాదు." నిష్ఠూరంగా అన్నాడు.

మోయలేని బరువేదో నెత్తిన పడినట్లు అనిపించింది నాకు. "ఏమిటీ, నాయనమ్మ చనిపోయిందా?" పిచ్చిగా అరిచాను.

"అదేమిటి, బాబూ! మీకు తెలీదా!" విస్తుపోయా డతను. అతను చెప్పిన సంగతు లివి.

చివరి రోజుల్లో నాయనమ్మ పడ్డ బాధలు చెప్పతరం కాదట. వేళకు భోజనం ఉండేది కాదట. మందులు అసలే లేవట. అదేమని ఎవరైనా అడిగితే రాక్షసిలా పడేదట మాఅమ్మ. ఆమె నోటికి జడిసి మౌనంగానే ఉండిపోయా రంతా. చివరి క్షణాల్లో నన్ను చూడాలని ఎంతగానో తపించిపోయిందంట నాయనమ్మ... నా పేరే తలుస్తూ కన్ను మూసిందట.

మా అమ్మ సంగతి నాకు బాగా తెలుసు. మానాయనమ్మ విషయంలో అతను చెప్పిన వేవీ అతిశయోక్తులు కావు. నిజానికి అంతకంటే ఎక్కువ బాధలే అనుభవించి ఉంటుంది ఆ వృద్ధురాలు.

ఇప్పుడు చెప్పు. నాయనమ్మకు నేనంటే ఎంత ప్రాణం. అటువంటి నాయనమ్మ చివరి చూపు కూడా నాకు దక్కనీయలేదే. నాయనమ్మను ఆ వృద్ధాప్యంలో రంపపు కోత పెట్టిందే. అసలు ఈవిడ మనిషేనా? అటువంటి దానిని నేనెందుకు ఆదరించాలి. ఇలాగే చిత్రహింసలు చేస్తేనే ఆమె పాపానికి పరిహారం." ఆవేశంగా అన్నాడు రాజశేఖరం. ఉద్వేగంతో అతని కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి.

వింటున్న రజని కళ్ళవెంటా ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి. హృదయం లేకుండా అంత పాపపు పనులు చేసిన అత్తగారిని హింసించడం న్యాయమే అనిపించిందా క్షణంలో. అంతలోనే ఏదో ఊహ...... ఆ ఊహకే కంపించి పోయిందామె.

అంతవరకూ ఆమెనే మౌనంగా పరిశీలిస్తున్న రాజశేఖరం, "చెప్పు, రజనీ, చెప్పు... దీన్లో నా తప్పేముంది?" ఆత్రంగా అడిగాడు.

కన్నీళ్ళతో అంది రజని- "తప్పేనండీ! ఆమె ఎంత పాపపు పనులు చేసినా, మిమ్మల్ని కన్నతల్లిగా ప్రేమించింది. మీ రింతటి వారైనా రంటే దానికి కారణం ఆమె కాదా? ఆమె చేసిన అవివేకపు పనికి మనం జీవితాంతం హింసించ కూడదు. ఈ వృద్ధాప్యంలో మనం చూపే నిరాదరణతో ఆమె ఎంత క్షోభ అనుభవిస్తుందో ఒక్కసారి ఆలోచించండి. ఆమెను అనేక పాపాలు చేసిన మీ తల్లిగా కాకుండా- ఒక తల్లిగా. ఒక వృద్ధురాలిగా, మమకారానికి దూరమైన ఒక దీనురాలిగా, ఆలోచించండి. మనకూ పిల్లలు పుట్టాక వాళ్ళ ఎదుట మనం అత్తగారిని ఇలాగే హింసిస్తూంటే ఇప్పుడు మీలాగే వాళ్ళ మనసులో మన మీద ద్వేషం ఏర్పరచుకొని మనల్ని మన వృద్ధాప్యంలో ఇంతకంటే ఘోరంగా ట్రీట్ చేస్తే.........ఆలోచించండి. ఆవిడ చేసిన తప్పే మనమూ చేయకూడదు. అత్తగారూ చేసిన తప్పులకు పశ్చాత్తాప పడుతున్నారు. చచ్చిన పామును మళ్ళీ మళ్ళీ చంపడం మంచిది కాదు. అవిడ కిప్పుడు మన ఆదరణ అవసరం. ఈ చివరి రోజుల లోనైనా ఆమెకు సుఖ పెట్టడం కొడుకుగా మీ బాధ్యత."

రాజశేఖరం బిగుసుకు పోయాడు. అతనిలో పోరాటం జరుగుతోంది.

రజని అతడినే చూస్తూ కూర్చొంది.

రాజశేఖరం ఏం నిర్ణయం తీసుకున్నాడు అన్నది కథకి అంత అవసరం కాదేమో!

*